క్లుప్తంగా

బీజేపీ ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో బీజేపీ కార్యకర్తలు

కేశంపేట: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకోవాలని వారు తీర్మానించారు. బీఆర్‌ఎస్ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, మళ్లీ కొత్త హామీలతో ప్రజల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తుందని వారు ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రొల్లు రఘురాం గౌడ్, మోటే శ్రీను, చిల్వేరు లింగయ్య, సొప్పరి నర్సింహా, శివాజీ, కంచుకోట నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు నాయక్



ప్రచారం నిర్వహిస్తున్న రాజు నాయక్

కేశంపేట: జనసేన పార్టీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జర్పుల రాజు నాయక్ అన్నారు. మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ నిరంతరం ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించాలని ఆయన కోరారు. సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్సూరెన్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేశ్, కవిత, శ్రీశైలం, పవన్ నాయక్, శ్రీను, శివ ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు దిమ్మతిరుగుతుంది

- ఎంపీపీ కృపేష్



మాట్లాడుతున్న ఎంపీపీ కృపేష్

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కృపేష్ పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు, పోచారం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృపేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ మేనిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు దిమ్మతిరుగుతోందని ఎద్దేవాచేశారు. మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు భేష్

యాచారం: స్వార్థం లేకుండా స్వచ్ఛంద సంస్థలు ప్రజా సేవలు చేయడం ఎంతో అభినందనీయమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ కొనియాడారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో ఆదివారం ఆడాల గణేశ్, వరలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏవీజీ ఫౌండేషన్ సంస్థను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ప్రజా సేవ చేస్తున్నాయని అన్నారు. పేదలను ప్రభుత్వాల కంటే ముందే సహాయం చేస్తున్న ఘనత ఈ సంస్థలకే దక్కుతుందని పేర్కొన్నారు. స్వార్థం లేకుండా సేవ చేసే వారికి దేవుడు కూడా అండగా ఉంటాడని అన్నారు. అనంతరం ఏవీజీ ఫౌండేషన్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత కృష్ణగౌడ్, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా, నక్కర్తమేడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శివలీల, ఏవీజీ ఫౌండేషన్ చైర్మన్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం

కడ్తాల్: మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ కొనియాడారు. ఆదివారం కడ్తాల్ మండల కేంద్రం సమీపంలోని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ పాఠశాలలో కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కలాం విగ్రహానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, బిక్కునాయక్, రాజేందర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు సత్యంయాదవ్, జహంగీర్‌అలీ, అజ్గర్‌అలీ, అశోక్, భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షేనా..!

- మంజూరు కాని రుణమాఫీ
- సాంకేతిక కారణాలతోనే జాప్యం అంటున్న మేనేజర్
- ఆందోళనలో 1,300మంది రైతులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



కొందుర్గు: బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణమాఫీ నేటికి 'అందని ద్రాక్షలా మారింది'. దేవుడు వరమిచ్చినా..పూజారి కనికరించడం లేదు అన్న చందంగా ఉంది రైతన్నల పరిస్థితి. 2018 ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.లక్ష వరకు రుణమాఫీ మంజూరు చేశారు. ఈ సందర్భంగా కొందుర్గు మండలానికి సంబంధించి 23వేల మంది రైతులకు గాను రూ.83 కోట్లు మంజూరైనట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కొందుర్గు మండలానికి సంబంధించిన రైతులు యూనియన్ బ్యాంక్, కొల్లూర్ ఎస్‌బీఐ, మొగిలిగిద్ద కార్పొరేట్ బ్యాంక్, రామచంద్రాపూర్, ముట్పూర్ ఐసీఐసీఐ బ్యాంక్, షాద్‌నగర్ పట్టణంలోని కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాలలో రుణాలు ఉన్నాయి. దాదాపు అన్ని బ్యాంకుల్లో రైతులకు రుణమాఫీ డబ్బులు అందాయి. కాని బ్యాంక్ ఆఫ్ బరోడాలో రుణం తీసుకున్న దాదాపు 1,300 మంది రైతులకు సంబంధించి రూ. 10 కోట్లు నేటికీ అందలేదు. రుణమాఫీ డబ్బుల కోసం ప్రతిరోజు వందలాది మంది రైతులు బ్యాంక్ అధికారులతోపాటు, వ్యవసాయాధికారుల చుట్టు తిరుగుతున్నారు. అసలు రుణమాఫీ ఇస్తరా..లేదా? అని అధికారులను కొందరు రైతులు ప్రశ్నిస్తున్నారు. అయినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి మధుసూదన్‌ను వివరణ కోరగా తమశాఖ నుంచి డబ్బులు మంజూరైన విషయం వాస్తవమేనన్నారు. అనంతరం ఈ విషయమై బ్యాంక్ మేనేజర్ ప్రసన్న కుమార్‌ను ప్రశ్నించగా మొదట్లో సాంకేతిక కారణాల వల్ల కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం అన్నీ సరిచేసి పంపామని ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదలైతే రైతుల అకౌంట్లలలో నేరుగా రుణమాఫీ డబ్బులు జమ అవుతాయని ఆయన తెలిపారు.

డబ్బులు రాలేదు..



ప్రభుత్వం రుణమాఫీ డబ్బులు విడుదల చేసినామని చెబుతుంది. కానీ బ్యాంక్‌కు వెళితే డబ్బులు రాలేదని అధికారులు చెబుతున్నారు. అంతలోనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఇంతకి రుణమాఫీ డబ్బులు వస్తాయో? రాదోనని అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు.

– బంటు కృష్ణయ్య, రైతు, ముట్పూర్

ఆశగా ఎదురు చూశాం..



ప్రభుత్వం రుణమాఫీ డబ్బులు ఇస్తుందని ఇంతవరకు ఆశగా ఎదురుచూశాం. ఇతర బ్యాంకుల్లో మా తోటి రైతులకు అందరికీ రుణమాఫీ డబ్బులు అందాయి. బరోడ బ్యాంకులో మాత్రమే రాలేదు. అధికారులు పేద రైతులను ఇబ్బంది పెడుతున్నారు.

–ఏర్పుల నర్సింలు, రైతు, ముట్పూర్

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యం

- కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ విజయ్‌కుమార్



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూరు: అభివృద్ధి సంక్షేమమే బీజేపీ లక్ష్యమని, కేంద్రం అమలు చేస్తున్న పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని షాద్‌నగర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ టి. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఆయన పలువురు నాయకులతో కలిసి మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధిని ఆకాంక్షించే ప్రజలు తప్పకుండా బీజేపీకే మద్దతిస్తారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలుగా సాయం చేస్తున్నప్పటికీ కేంద్రంపై ఆరోపణలు చేయడం దారుణమని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో శాంతియుత వాతావరణం ఏర్పడినట్లు చెప్పారు. దేశంలోని ఎన్నో ప్రాంతాల్లో ఆయా దేశాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు వ్యాపారాలను మరింతగా విస్తరించడంతో పాటు స్వేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో కొచ్చే విధంగా ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందెబాబాయ్య, శ్రీవర్ధన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రణీత్‌రెడ్డి, నర్సింహ్మాగౌడ్, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఈ నెల 16న మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు జగన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు. అలాగే మండల పరిధిలోని మాలెపల్లి, పోలెపల్లి గ్రామాల్లో జరిగే గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో వారు పాల్గొంటారని పేర్కొన్నారు.

'పట్నం' గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తామని ఆదిబట్ల మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు జంగయ్య ధీమా వ్యక్తం చేశారు. మంగళ్‌పల్లిలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టో ప్రజలందరికీ ఆమోదయోగ్యంగా ఉందని పేర్కొన్నారు. ఆసరా పెన్షన్ రూ.2016 నుంచి రూ.5016కు పెంచడం శుభపరిణామమన్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ.4,016 నుంచి రూ.6016కు పెంచుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. రైతుబంధు ద్వారా ఎకరానికి రూ.10వేల నుంచి రూ.16వేలకు పెంచుతామని తెలిపారు. అర్హులైన పేద మహిళలకు నెలకు రూ.3,000 అందిస్తామని ప్రకటించడం సంతోషకరమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి అందరూ పనిచేయాలని కోరారు.

ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయండి

- సర్పంచ్ రవీందర్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: కాశీంబౌలి గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆన్‌ఆఫ్ స్విచ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, రైతులతో సర్పంచ్ రవీందర్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విషయంలో మండల విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆన్‌ఆఫ్‌స్విచ్ లేని కారణంగా అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్విచ్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు. రైతులు సామా అనిమిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్

ఉద్యోగ గ్రహీతలకు సన్మానం



సన్మానించిన ముట్పూర్ గ్రామస్తులు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్ గ్రామానికి చెందిన గుట్టల్ల రాజేందర్, కుమ్మరి శ్రీనాథ గౌరిగే మమతలు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సర్పంచ్ నర్సింహా రెడ్డి వారిని శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత లక్ష్యం ఎంచుకొని పట్టుదలతో ముందుకు సాగితే భవిష్యత్‌లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సలామ్, గోపాల్, బందులాల్, యాదయ్య, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది స్వర్ణయుగం

బీఆర్‌ఎస్ నాయకుడు రమేశ్

మంచాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని ఆ పార్టీ మంచాల మండల అధ్యక్షుడు రమేశ్ కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే రాష్ట్రంలో స్వర్ణయుగం మొదలవుతుందన్నారు. ఆదివారం మంచాల మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో ప్రజారంజక పాలనకు దారి తీస్తుందన్నారు. బడుగు, బలహీనవర్గాలకు మేలు చేయాలని లక్ష్యంతో బీఆర్‌ఎస్ ముందుకు పోతుందన్నారు. ఈ సారి అధికారంలోకి రాగానే ఆసరా ఫించన్ రూ.5016కు పెంచుతామని తెలిపారు. రేషన్ కార్డు లబ్ధిదారుడికి సన్న బియ్యం పంపిణీ, దివ్యాంగులకు ఫించన్ రూ.6016కు పెంచుతామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధిలోని శివసాయి నగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శివవర్దన్, అధ్యక్షులుగా రామస్వామి, గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వంగూరు మల్లేశం, వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా జంగారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా మంగ్యా నాయక్, కోశాధికారిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా హనుమంత్, ఉప ప్రచార కార్యదర్శిగా సంతోష్, కార్యవర్గ సభ్యులుగా ఎల్లయ్య, నారాయణ రెడ్డి, అంజయ్య, సత్యనారాయణ, వినోద్, వెంకటేష్, సృజనలను ఎన్నుకున్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

అంబేడ్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడిగా ఎండీ నవాబ్



నవాబ్‌కు నియామకపత్రం అందిస్తున్న సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు

చేవెళ్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆల్‌ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేగరి రాజు, రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌లు పేర్కొన్నారు. చేవెళ్ల మండలంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ చేవెళ్ల మండల ఉపాధ్యక్షుడిగా ఎండీ నవాబ్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సమాజంలో అసమానతలను రూపుమాపడం కోసం ఉద్యమించాలన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు బి.క్రిష్ణ, ప్రసాద్, వినోద్, లక్ష్మణ్, కిరణ్, శ్రీనివాస్, వెంకట్‌రాజ్, యాదగిరి, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం

చేవెళ్ల: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. చేవెళ్ల మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలకోసం ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాంత్, శ్రీపాద్‌లు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గ్రామాల్లో దుర్గామాత పూజలు..

మండలంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత పూజలు ప్రారంభించారు. చేవెళ్ల, దామరగిద్ద, మల్కాపూర్, తదితర గ్రామాల్లో భక్తులు మాలలు ధరించారు. మండపం వద్ద ప్రత్యేక పూజలు, నిత్యం అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

షాబాద్‌లో..

షాబాద్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి, కుమ్మరిగూడ, షాబాద్, సర్దార్‌నగర్, హైతాబాద్, మల్లారెడ్డిగూడ, గ్రామాల్లో ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. అమ్మవారి మంటపాలను విద్యుత్ కాంతులతో అలంకరించారు. మొదటి రోజు శ్రీ బాలత్రిపుర సుందరి దేవీగా దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని శ్రీఅంబాభవానీమాత దేవాలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, హోమంవంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం వంటివి ఏర్పాటు చేశారు.



షాబాద్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు



షాద్‌నగర్‌రూరల్: బాలాత్రిపురసుందరిదేవిగా

కాంగ్రెస్ అధికారం ఖాయం



కొత్తూరు: కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

కొత్తూరు: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో కొస్తుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. సిద్ధాపూర్ గ్రామానికి చెందిన ఆయా పార్టీల నాయకులు ఆదివారం గ్రామ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి శంకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలోనే పలు హామీలు ఇస్తూ వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ హయంలోనే ప్రారంభించిన ఆయా ప్రాజెక్టులకు పేర్లు మార్చి రూ. కోట్ల నిధులు పక్కదారి పట్టిస్తున్న ఘనత బీఆర్‌ఎస్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా శాఖాల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయలేని అసమర్థ ప్రభుత్వంగా బీఆర్‌ఎస్ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఎల్లారం ప్రభాకర్‌రెడ్డి, పిప్పళ్ల రాజు, లింగం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు..

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వీర్లపల్లి శంకర్ పేరును పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆ పార్టీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. పార్టీ కార్యాలయం నుంచి పట్టణ చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కావలి శ్రీశైలం, చెంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కొత్తూరు పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్ బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. హరినాథ్‌రెడ్డి, నర్సింహ్మా, శ్రీశైలం, రాజు, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌రూరల్‌లో..

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట, మొగిలిగిద్ద, గ్రామాలలో బాణసంచా కాల్చి సంబురాలను జరుపుకున్నారు. ఎంపీటీసీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలిశ్రీశైలం మాట్లాడారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు బద్దులమల్లయ్య, వార్డు సభ్యుడు బుడ్డనర్సింహ్మా, రాజు, శివ, తదితరులు పాల్గొన్నారు.



ఎలికట్టలో బాణసంచా పేల్చి సంబురాలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు

పార్టీలో చేరికలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లిశంకర్ అన్నారు. మొగిలిగిద్ద గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లాశ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 100మంది యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వీర్లపల్లిశంకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో శాశ్వత అభివృద్ధి జరగలేదని, సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

ఊరి పేరే.. ఆ నేత ఇంటి పేరు..!

చిన్నప్పటి నుంచి రాజకీయాల పట్ల ఆకర్షితుడై సేవా కార్యక్రమాలు చేపడుతూ నిత్యం ప్రజల మధ్య ఉండే ఆ నేత ఊరి పేరు తన ఇంటి పేరుగా మారింది. షాద్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కాస్లాబాద్ శంకరయ్య పేరును ప్రకటించింది. ఆయన స్వగ్రామం వీర్లపల్లి. ఆయన ఇంటి పేరు కాస్లాబాద్ కానీ సొంత ఊరు పేరునే ఇంటి పేరుగా మార్చుకున్నారు. ఈ క్రమంలోనే అందరూ ఆయనను వీర్లపల్లి శంకర్‌గా పిలుస్తారు.



కొత్తూరు: బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కొవ్వొత్తుల ర్యాలీ

తుర్కయంజాల్: గ్రూప్–2 నోటిఫికేషన్ రద్దు చేయడంతో మనస్థాపానికి గురయి ఆత్మహత్యకు పాల్పడిన ప్రవల్లిక ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆదివారం తుర్కయంజాల్‌లో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేసిందని, పరీక్షలు నిర్వహించడం చేత కాకపోవడంతో చేతులెత్తేసిందని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తకుర్మ కుమార్, నర్సింహ, అర్జున్, కిషన్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్సీ పరామర్శ

కడ్తాల్: రావిచేడ్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన మల్లారెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర నాయకుడు మోహన్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీను తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌దే అధికారం



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎంఎస్ రత్నం, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు

- పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మొయినాబాద్‌రూరల్: మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని, గ్రామాల అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం కేసీఆర్‌కు సాటి లేరని మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జీవంతులు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నక్కలపల్లి, ఎత్‌మార్‌పల్లి, టోల్‌కట్ట, కనకమామిడి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచార సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి, జీవంతులు ఆయా నాయకులతో కలిసి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అనుకున్నది సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ సాధనతో పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మాటతప్పని మనిషి అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ని గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చెట్టుకింది ప్రవీణ్‌రెడ్డి, సర్పంచ్‌లు పట్లోళ్ల జనార్దన్‌రెడ్డి, గుండాల నవనీతారాజు, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రవీందర్, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాహుఫ్, గణేష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక..

కనకమామిడి మాజీ సర్పంచ్ ఎంఎస్ రత్నం 30 మంది కార్యకర్తలతో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా ఎత్‌మార్‌పల్లిలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకురాలు ఫైయిముదాబేగం 10 మంది నాయకులు, కార్యకర్తలతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు.